క్లుప్తంగా

నేడు ఏడీ, ఏఓ కార్యాలయాల ప్రారంభం

నూజివీడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిన వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారి కార్యాలయ భవనాలను ఈ నెల 26వ తేదీన ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నట్టు ఏడీఏ జి.విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని కోరారు.

నేడు దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

నూజివీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 26న ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతుల మీదుగా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ వీపీ విజయకుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 10 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని మంగళవారం తెలిపారు.

మొహరం ఉత్సవాలు ప్రారంభం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని జల్‌జలే సాహెబ్ పంజా వద్ద మొహరం ఉత్సవాల్లో భాగంగా పీర్ల పండగ వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం పీర్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం హజరత్ మహబూబ్ సుభానీ జెండా ఊరేగింపు, రాత్రి ఫాతేహాఖాని జరుగుతుంది. బుధవారం రాత్రి అగ్నిగుండం, గురువారం పలువురు మతగురువులతో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం చేస్తారు. శుక్రవారం మేళతాళాలతో అగ్నిగుండం, శనివారం మెయిన్ రోడ్డులో పీర్లు ఊరేగింపు జరుగుతుందని జల్‌జలే సాహెబ్ పంజా ఆర్గనైజింగ్ సొసైటీ సభ్యులు తెలిపారు.

డ్రెయినేజీలలో పూడిక తీత పనులు

మైలవరం: కురుస్తున్న భారీ వర్షాలకు మైలవరం మండలంలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ఆదేశాలతో పొక్లెయిన్ ఏర్పాటు చేసి మైలవరంలోని తారకరామనగర్, నారాయణనగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలో పూడిక తొలగింపు కార్యక్రమం చేపట్టారు. దీంతో వర్షపు నీరు పారుదల సులభతరం అయింది. సకాలంలో స్పందించి డ్రెయినేజీలకు మరమ్మతులు చేపట్టిన పంచాయతీ, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రహీమ్, జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, సర్పంచ్ మంజుభార్గవి పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు సన్మానం



ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని పలు సచివాలయాల నుంచి బదిలీ అయిన పలువురు మహిళా పోలీసులను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై చంటిబాబు సన్మానించారు. ఆగిరిపల్లి మండలం చొప్పరమెట్ల మహిళా పోలీస్ పెన్నా చైతన్య, నెక్కలం గొల్లగూడెం మహిళా పోలీస్ బోగిరి మృణాళిని ఇటీవల బదిలీ అయ్యారు. కార్యక్రమంలో ఏఎస్సై తావిర్యానాయక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు మహాలక్ష్మి (35) అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను వైఎస్సార్ బీమా ద్వారా మంగళవారం ఎంపీటీసీ సభ్యుడు గోపీ చేతులమీదుగా మహాలక్ష్మి కుమారుడికి అందజేశారు.

భారీవర్షాలతో ఉద్ధృతంగా వాగులు



గంపలగూడెం మండలంలో తోటమూల-వినగడప గ్రామాల నడుమ ఉద్ధృతంగా పారుతున్న కట్టలేరు



ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ వంతెన వద్ద వరద ఉద్ధృతిని పరిశీలిస్తున్న ఏసీపీ రమేష్, కాజా బ్రహ్మయ్య

తిరువూరు: వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో తిరువూరు మండలంలోని వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. చౌటపల్లివద్ద వెదుళ్లవాగుకు వరదనీరు రావడంతో తిరువూరు నుంచి గానుగపాడు, జీకొత్తూరు గ్రామాలకు రాకపోకలు నియంత్రిస్తున్నారు. అక్కపాలెం, కోకిలంపాడు, మల్లేల రహదారుల్లో కూడా వాగుల వద్ద వరద ఉద్ధృతంగా పారుతుండటంతో రెవెన్యూ, పోలీసులు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు సైతం వాగుల్లోకి వరద నీరు చేరుతోంది.

కట్టలేరులో..

గంపలగూడెం: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రధాన నీటివనరైన కట్టలేరులో మంగళవారం వరదనీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. తోటమూల-వినగడప గ్రామాల నడుమ కట్టలేరు వద్ద ధ్వంసమైన వంతెన వద్ద రాకపోకల కోసం నిర్మించిన డైవర్షన్ రహదారిపై నీరు అడుగుల ఎత్తున పారుతోంది. దీంతో గంపలగూడెం-విజయవాడ వయా నార్కింపాడు ఆర్‌అండ్‌బీ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఏటి వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భద్రతాచర్యలు చేపట్టారు. ఏటి వద్ద పరిస్థితిని మైలవరం ఏసీపీ రమేష్, తిరువూరు సీఐ ఆర్ భీమరాజు, ఎస్ఐ రాంబాబు పరిశీలించారు. కాగా సాగుపైర్లలో వర్షపు నీరునిల్వ లేకుండా బయటకు వెళ్లగొట్టడం ద్వారా పైర్లను రక్షించుకోవాలని వ్యవసాయాధికారి బీ సాయిశ్రీ రైతులకు సూచించారు.

బుడమేరు వరదతో అప్రమత్తంగా ఉండాలి

జి.కొండూరు: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బుడమేరు ఉధ్ధృతి గంట గంటకు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మైలవరం ఏసీపీ ఎం.రమేష్ అన్నారు. మండల పరిధి ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ ఉన్న వంతెన వద్ద బుడమేరు వరద ఉద్ధృతిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఏసీపీ మాట్లాడుతూ వంతెన మీదుగా వరద ప్రవాహం కొనసాగుతున్న క్రమంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెప్పారు. జి.కొండూరు నుంచి కందులపాడు మీదుగా విజయవాడ వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. అదేవిధంగా బుడమేరును అనుకొని ఉన్న సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ కాజా బ్రహ్మయ్య, సీఐ మోహన్‌రెడ్డి, ఎస్సై ధర్మరాజు పాల్గొన్నారు.



నరుకుళ్లపాడు-ఓబులాపురం రహదారిని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీను



రాయనపాడు చప్టాపై ప్రవహిస్తున్న బుడమేరు వరద

నిలిచిన రాకపోకలు

జి.కొండూరు: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు జి.కొండూరు మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. హెచ్ ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ ఉన్న బుడమేరు వాగులో వరద ఉద్ధృతి పెరగడంతో మంగళవారం ఉదయం నుంచి వంతెన మీదుగా వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. దీంతో జి.కొండూరు వైపు నుంచి కందులపాడు, వెల్లటూరు, వెలగలేరు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు, అదేవిధంగా కందులపాడు వైపు నుంచి జి.కొండూరు వైపు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గం వైపు వెళ్లే వాహనాలు చెవుటూరు, వెంకటాపురం, కుంటుముక్కల, వెల్లటూరు మీదుగా విజయవాడ వైపు లేదా జి.కొండూరు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను ఇబ్రహీంపట్నం మీదుగా వెళ్లాలని పోలీసులు సూచనలు జారీ చేశారు. అదేవిధంగా తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాల నడుమ ఉన్న జమ్మివాగు పొంగడంతో జి.కొండూరు వైపు నుంచి తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం వైపు వెళ్లే వాహనాలు, ఎన్టీఆర్ జిల్లాలోని గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాలకు జి.కొండూరు వైపు వచ్చేందుకు వీలులేక వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

వాహనదారులు జాగ్రతలు పాటించాలి

రెడ్డిగూడెం: వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెడ్డిగూడెం ఎస్సై ఎస్ శ్రీను పేర్కొన్నారు. మండలంలోని నరుకుళ్లపాడు-ఓబులాపురం, కూనపరాజుపర్వ-విస్సన్నపేట రహదారులల్లో వరద నీరు రోడ్డుపై నుంచి ఉద్ధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున్న ప్రజలు ఈ మార్గాల నుంచి రాకపోకలు సాగించరాదని ఆయన తెలిపారు. తొలుత ఎస్సై నరుకుళ్లపాడు-ఓబులాపురం రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీటిని పరిశీలించారు.

గ్రామాల్లో బుడమేరు వరద ప్రభావం

రాయనపాడు(విజయవాడరూరల్): భారీగా కురుస్తున్న వర్షాలకు బుడమేరు పొంగి ప్రవహిస్తోంది. పై ప్రాంతాల నుంచి వస్తున్న వరద కారణంగా వెలగలేరు రెగ్యులేటర్ వద్ద బుడమేరు గేట్లు ఎత్తివేయడంతో దిగువ గ్రామాలకు బుడమేరు వరద ప్రవహిస్తోంది. బుడమేరు కాల్వలో ఆరు అడుగల వరదనీరు ప్రవహిస్తున్నందున రాయనపాడు గ్రామంలో ఆర్‌అండ్‌బీ చప్టా పై నీరు ప్రవహిస్తోంది. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేదని ఇరిగేషన్ ఏఈ బి.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం రాత్రికి బుడమేరు వరద పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాదుల నిరసన

తిరువూరు: మణిపూర్‌లో మహిళలపై అనాగరికంగా వ్యవహరించడం, హతమార్చడం వంటి సంఘటనలకు తిరువూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలియజేశారు. మణిపూర్ సంఘటనలకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం మణిపూర్‌లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.



తిరువూరు కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

మానవ మృగాలను పెంచిపోషిండం వలనే..

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం రాజకీయ మనుగడ కోసం మానవ మృగాలను పెంచిపోషిండం వలనే మణిపూర్‌లో దారుణమైన ఘటనలు జరుగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నంలో మణిపూర్‌లోని జరుగుతున్న దౌర్జన్యాలు, అఘాయిత్యాలపై మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు.

దాడులను అరికట్టాలి

విస్సన్నపేట: మణిపూర్‌లో జరుగుతున్న దాడులను అరికట్టాలని గ్లోబల్ తెలుగు పాస్టర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద మంగళవారం పాస్టర్లు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మద్దతుగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్కెపోగు వందనకుమార్ పాల్గొన్నారు.

ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం/మైలవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, స్విచ్‌బోర్డుల వద్ద జాగ్రత్తలు పాటించి ప్రమాదాలబారిన పడకుండా ఉండాలన్నారు. రైతులు వ్యవసాయ పొలాల్లో విషసర్పాలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

చాట్రాయి: తల్లిదండ్రుల బెంగతో స్కూల్ నుంచి తప్పించుకున్న బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. చాట్రాయి మండలం సి గుడిపాడుకు చెందిన బిలుగుది బాబూరావు కుమారుడు సాత్విక్ చింతలపూడి గురుకుల పాఠశాల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం గురుకుల పాఠశాల నుంచి తప్పించుకుని కాలి నడకన తన ఇంటికి వస్తున్నాడు. పోలవరం ఆంజనేయ స్వామి గుడి వద్ద బాలుడు ఒక్కడే ఉండడంతో అటువైపుగా వస్తున్న ఏఎస్సై గజపతి ప్రశ్నించారు. అమ్మ నాన్నలపై బెంగపెట్టుకున్నాని ఎవరికి చెప్పకుండా స్కూల్ నుంచి వస్తున్నాను అని బాలుడు చెప్పడంతో తన తల్లిదండ్రులకు ఫోన్‌చేసి బాలుడుని అప్పగించారు.

వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): వర్షాకాలంలో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో మలేరియా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్ చెప్పారు. కృష్ణలంకలోని సబ్ యూనిట్ టు మలేరియా రక్త పరీక్ష కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో లార్వా పెరిగే ప్రమాదం ఉన్న కారణంగా మలేరియా, డెంగీ లాంటి ప్రమాదకరమైన జ్వరాల బారిన ప్రజలు పడకుండా అప్రమత్తంగా ఉండి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు మురికి గుంటల్లోనూ, నీరు నిల్వ ఉన్న చోట లార్వా పెరగకుండా ఎంఎల్‌ఓ ఆయిల్, బీటీఐ పౌడర్‌లతో పాటు లార్వా నిర్మూలించే స్ప్రేయింగ్ చేయాలన్నారు. రోగ నిర్ధారణ కోసం సత్వరమే జ్వర పరీక్షలు చేసి రిపోర్టులను ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. అవసరమైతే పేషెంట్‌కు ట్రీట్‌మెంట్ అందేలా సత్వర వైద్య సేవలు అందజేయాలని చెప్పారు. సమావేశంలో సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవ రెడ్డి, గౌరీశంకర్, టెక్నీషియన్ నాగేశ్వరరావు, మేస్త్రి వేగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్

ఫీడర్ చానల్ ఆక్రమణలను తొలగించాలి

ఆగిరిపల్లి(నూజివీడు): ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలోని పెద్ద చెరువుకెళ్లే ఫీడర్ చానల్ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు మంగళవారం నిర్ధారించారు. ఈ నెల 19న గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష సభలో గ్రామానికి చెందిన రామకృష్ణ అనే రైతు పెద్ద చెరువు ఫీడర్ చానల్ భూమిని ఆక్రమించి, అందులో కట్టడం కట్టారని, రైతుల రాకపోకలకు వీల్లేకుండా ఆక్రమిత భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడని రైతులు వెంకటేశ్వరరావు, రమేష్, శివరామకృష్ణ, సాంబయ్య, వేణు, సీతారామయ్య అధికారులకు అర్జీని అందజేశారు. స్పందించిన తహసీల్దార్ ఉదయభాస్కర్ మండల సర్వేయర్‌తో సర్వే చేయించి సరిహద్దు రాళ్లను పాతించారు. ఆక్రమణలను స్వయంగా తొలగించాలని సాయంత్రం ఐదు గంటల వరకు రైతు రామకృష్ణకు గడువిచ్చారు. తొలగించని పక్షంలో రెవిన్యూశాఖ ఆధ్వర్యంలో జేసీబీ ఏర్పాటు చేసి తొలగిస్తామని హెచ్చరించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెడ్డిగూడెం: భారీ వర్షాలు కురుస్తున్నందున రెడ్డిగూడెం మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగు తదితర విషయాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలసిందిగా ఆయా పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలలో ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని పేర్కొన్నారు. ఈ విధంగా చేయడం వల్ల డయేరియా తదితర వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు.

1 నుంచి యోగా శిక్షణ తరగతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అజిత్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ఆగస్టు 1వ తేదీ నుంచి యోగా ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం ఉదయం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ చొరవ మేరకు శిక్షణ చేపట్టామని, కేంద్ర ఆయుష్ విభాగం ఒక యోగా ట్రైనర్‌ను ప్రత్యేకంగా నియమించిందని తెలిపారు. యోగాసనాలతో పాటు ఆరోగ్య సూత్రాలను వివరిస్తారన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

నూజివీడు: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎం.యలమంద పేర్కొన్నారు. పట్టణంలోని బంగినపల్లితోట, అమ్మవారితోట సచివాలయాల పరిధిలోని మహిళలకు మంగళవారం అవగాహన కల్పించారు. పరిసరాల్లో మురుగునీటితో పాటు మంచినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని యలమంద సూచించారు.

ధ్రువీకరణపత్రాల పంపిణీ



గుళ్లపూడిలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ, ప్రజాప్రతినిధులు



చనుబండ-2లో ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

నెమలి/గుళ్లపూడి(గంపలగూడెం): మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. గుళ్లపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పోట్రు వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అద్దంకి విశ్వనాథం, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డిలు 2,164 మందికి అవసరమైన ధ్రువీకరణపత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ముత్తయ్య, సత్యనారాయణలు పాల్గొన్నారు. నెమలి సచివాలయంలో సర్పంచ్‌లు రామకృష్ణ, వీరప్రసాద్ 1,788 మందికి ధ్రువపత్రాల పంపిణీ చేశారు.

అర్హులందరికీ పథకాలు

చాట్రాయి: రాజకీయాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందని ఎంపీడీఓ కె.దుర్గాప్రసాదు తెలిపారు. చాట్రాయి మండలం చనుబండ-2లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. కృష్ణారావు పాలెం, సూరంపాలెం గ్రామాల్లో ఆన్‌లైన్ అయిన గృహాలకు హౌసింగ్ మ్యాపింగ్ కాకపోవడంతో గృహాలు నిర్మించుకోవడానికి వీలు పడడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరావు, శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చినబాబులు సభ దృష్టికి తీసికెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు.

జక్కంపూడిలో..

విజయవాడరూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని విజయవాడ రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.భారతి అధ్యక్షతన జక్కంపూడిలో జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా 250 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.



జక్కంపూడిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు

పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

మైలవరం: గ్రామాల్లో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ ఇస్లావాత్ ప్రసన్నరాణి స్వామి తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెంసచివాలయంలో సర్పంచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీతోపాటు ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

రెడ్డిగూడెం: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అని ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ ద్వారా ఎప్పటికప్పుడు తన బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఎంఈఓ రమేష్ అన్నారు. సమగ్ర శిక్ష షెడ్యూల్‌లో భాగంగా మంగళవారం నాగులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను సందర్శించిన రమేష్ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. నాగులూరు కాంప్లెక్స్ చైర్మన్ ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ రమేష్

ఇంగ్లిష్ బోధనలో మెలకువలు పాటించాలి

పెనుగొలను(గంపలగూడెం): ఇంగ్లిష్ బోధనలో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు తగిన మెలకువలు పాటించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిన బోధించాలని ఎంఈఓ పీడీఎల్ నరసింహారావు తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలనులో కాంప్లెక్స్‌లో మంగళవారం తిరువూరు, ఏకొండూరు, గంపలగూడెం మండలాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణను వినియోగించుకోవాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ ఎం క్రిష్టాఫర్, మూడు మండలాల పరిధిలోని 51 మంది ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని నందిగామ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య అన్నారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రైమరీ లెవల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు చదవడం, రాయడం, అనర్గళంగా మాట్లాడటం నేర్పి ఉత్తమ విద్యార్థులుగా హైస్కూళ్లకు పంపాలని సూచించారు. బుధవారం రెండోరోజు కూడా సదస్సు జరగనుంది. ఎంఈఓలు సీహెచ్ పుష్పలత, ఎం.రత్నశ్యామ్ బాబు, హెచ్ఎం డేవిడ్ రాక్ పెల్లర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

విస్సన్నపేట: భగవాన్ సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పుట్రేల గ్రామ సచివాలయం-1 దగ్గర బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు జె.రంగారెడ్డి మంగళవారం తెలిపారు. నూజివీడు గిఫర్డు మెమోరియల్ హాస్పిటల్ కంటి వైద్యుడు జెమృధ్ షాహిన్, సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలు

చాట్రాయి: చాట్రాయి మండలం కొత్తగూడెం, బూరుగుగగూడెం గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను బుధవారం నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చేతులు మీదుగా ప్రాంభించనున్నట్టు ఎంపీడీఓ కె.దుర్గా ప్రసాదు తెలిపారు. బూరుగుగూడెం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.

నిబంధనల ఉల్లంఘనులకు జరిమానా

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ కలరా హాస్పిటల్ వద్ద గల నగరపాలక సంస్థ సర్కిల్-1 కార్యాలయంలో ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి వి.విజయ్‌కుమార్ రెడ్డి మంగళవారం మొబైల్ కోర్టును నిర్వహించారు. సర్కిల్-1 కార్యాలయ పరిధిలోని పశ్చిమ నియోజకవర్గ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలను ఉల్లంఘించిన 12 మందిపై కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. ఆయా కేసుల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తులు, పశువులను విచ్చలవిడిగా రోడ్లపైకి వదిలివేసే వారు, రోడ్లపై చెత్త వేయటం, డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం కలిగించేలా చెత్తాచెదారం పడేసిన వారికి న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి రూ.5,170 జరిమానా విధించారు. ఇలాగే నిబంధనలకు విరుద్ధంగా మరో మారు వ్యవహరిస్తే చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.